క్లుప్తంగా

ఎమ్మెల్యేను కలిసిన రాజీవ్‌గాంధీ నగర్ నూతన కార్యవర్గం

కూకట్‌పల్లి: బాలానగర్ డివిజన్ పరిధిలోని రాజీవ్‌గాంధీనగర్ సంక్షేమ సంఘం ఎన్నికల్లో రెండోసారి అధ్యక్షుడిగా గెలుపొందిన అబ్దుల అజీజ్, ప్రధాన కార్యదర్శిగా ఎన్కే నరేష్ విజయం సాధించారు. ఈ సందర్భంగా బుధవారం వారు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కూకట్‌పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారిని శాలువాతో సత్కరించి శుభకాంక్షలు తెలిపారు. రాజీవ్‌గాంధీనగర్ వాసులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇందిరానగర్ అధ్యక్షుడు గోపు వెంకటరెడ్డి, ఏరియా కమిటీ అధ్యక్షుడు నగేష్, సుల్తాన్, ఏఐఎంఐఎం బస్తీ అధ్యక్షుడు ఫాయక్ అలి, లలూ, సర్దార్, గౌస్, మోయిజ్, శంషు తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు క్యూరింగ్ పనుల పరిశీలన

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్‌లోని న్యూ అల్లాపూర్‌లో ఎస్‌డీ ఫంక్షన్‌హాలు పక్కన వీధిలో జరుగుతున్న సీసీరోడ్డు క్యూరింగ్ పనులను బుధవారం కార్పొరేటర్ సబిహా బేగం పరిశీలించారు. సీసీరోడ్డు పనులన్నీ అనుకున్న సమయానికి పూర్తి చేశామని ఆమె అన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ను స్థానికులు సన్మానించారు. పాత రోడ్లతో అనేక ఇబ్బందులు పడ్డామని.. కార్పొరేటర్ మాట ఇచ్చి నెరవేర్చారని కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నజీర్ అజీజ్, ఇస్మాయిల్, రఫియా బేగం, మహమ్మద్ యూసఫ్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



ఫాతిమా బీ కుటుంబీకులకు ఆర్థికసాయం అందజేస్తున్న కార్పొరేటర్

ఆల్విన్‌కాలనీ: ఎల్లమ్మబండ పరిధిలోని ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన ఫాతిమా బీ అనారోగ్యంతో బాధపడుతూ మరణించింది. విషయం తెలుసుకున్న ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ బుధవారం ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో షౌకత్‌అలీ మున్నా, వాసుదేవరావు, ఫజల్ బేగ్, షబ్బీర్ బేగ్, సయ్యద్ అఫ్జల్, అలీ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం



కూకట్‌పల్లి: దానాల్నింటిలోకెల్లా అన్నదానం మిన్న అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు అర్శనపల్లి సూర్యరావు పేర్కొన్నారు. ఆయన మనుమడు అరిహాంత్ 4వ పుట్టిన రోజు సందర్భంగా బుధవారం శివానంద రిహాబిలిటేషన్ సెంటర్‌లోని నిరుపేదలకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చౌదరి నర్సింగరావు, కె. జస్వంత్‌రావు, ఎస్. హనుమంతరావు, కోటేశ్వరరావు, అనంత నాగరాజు, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలి

దుండిగల్: కంటి సమస్యలను శాశ్వత పరిష్కారం చూపేందుకే రాష్ట్ర ప్రభుత్వం కంటివెలుగును తీసుకొచ్చిందని దుండిగల్ మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణరావు అన్నారు. బుధవారం దుండిగల్ వార్డు కార్యాలయంలో కొనసాగుతున్న కంటివెలుగు శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పలువురికి ఉచితంగా కళ్లద్దాలు అందజేసిన కమిషనర్ మాట్లాడారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ కళ్ల పరీక్షలు చేయించుకోవాలన్నారు. అవసరమైన వారికి కళ్లద్దాలతో పాటు శస్త్ర చికిత్సలు చేయిస్తున్నామని పేర్కొన్నారు. ఉదయం 9గంటల నుంచి 4గంటల వరకు కొనసాగే శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంహెచ్ఓ డాక్టర్ నిర్మల, మున్సిపల్, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

కార్పొరేటర్ పర్యటన

మియాపూర్: కాలనీలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని ఇంద్రానగర్ వీకర్ సెక్షన్ కాలనీలో అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్డు వేయాలని కార్పొరేటర్ దృష్టికి కాలనీవాసులు తీసుకువెళ్లారు. ఆమె మాట్లాడుతూ.. కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు, సీసీ రోడ్డు నిర్మాణ పనుల నివేదికను రూపొందించాలని జీహెచ్‌సీ ఇంజనీరింగ్ అధికారులను కోరారు. ఆమె వెంట చందానగర్ డివిజన్ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, అధికారులు ఈఈ శ్రీకాంతిని,డీఈ ప్రవీణ్, ఏఈ సంతోష్, నాయకులు పాల్గొన్నారు.

కట్ట పొడవునా వాహనాలే..



బోయిన్ చెరువు కట్టపై అక్రమ పార్కింగ్



- ఇరువైపుల పార్కింగ్‌తో రాకపోకలకు ఇబ్బందులు
- కట్ట మూల మలుపుతో తరచు ప్రమాదాలు
- పట్టించుకోని సంబంధిత అధికారులు

ఓల్డ్‌బోయిన్‌పల్లి: ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లోని హస్మత్‌పేట బోయిన్ చెరువు కట్ట అక్రమ పార్కింగ్‌కు అడ్డగా మారింది.ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌కు ప్రధాన రహదారుల్లో ఒకటిగా ఉన్న ఈ రహదారిలో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. రోడ్డుకు ఇరువైపుల వాహనాలను పార్కింగ్ చేస్తుండటంతో వాహనదారులుఇబ్బందులు పడుతున్నారు. అక్రమ పార్కింగ్‌కు అడ్డుకట్ట వేయడంలో సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు.

◆ పదుల సంఖ్యలో వాహనాలుపార్కింగ్ చేయడంతోరోడ్డు కుంచించుకుపోతోంది. కట్టమైసమ్మ అమ్మవారి దేవాలయం వద్ద వంపుగా ఉండటంతో పార్కింగ్ చేసిన వాహనాలు కనిపించవు. దీంతో వేగంగా వెళ్లేవారు ప్రమాదాలకు గురవుతున్నారు. అయినా ఏ ఒక్క అధికారి స్పందించడంలేదు. చెరువు కట్ట అక్రమ పార్కింగ్‌కు నిలయంగా మారింది. రోజుల తరబడి కట్టపై వాహనాలు పార్కింగ్ చేసినాఆ వాహనాలు ఎవరివని కూడా ట్రాఫిక్ పోలీసులు ఆరా తీయడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు.

◆ చెరువు కట్ట అల్వాల్ పోలీసుస్టేషన్‌కు అమాడ దూరంలో ఉండటం...అక్రమపార్కింగ్ విషయాన్ని పోలీసులుసీరియస్‌గా తీసుకోకపోవడంతో వాననాలనుపార్కింగ్ చేసి వెళ్లిపోతున్నారు. ఉదయం వాకింగ్ చేసే వారు రోడ్డుపై నుంచే వెళ్లాల్సిన దుస్థితి నెలకొందని స్థానికులు చెబుతున్నారు. చెరువు కట్ట రిటర్నింగ్ వాల్ పనులు జరుగుతున్న సమయంలో అధికారులు పనుల పర్యావేక్షణకు వచ్చినా అక్రమ పార్కింగ్‌ను పట్టించుకోలేదని పేర్కొంటున్నారు. ఈ విషయంపై జీహెచ్ఎంసీ, ఇరిగేషన్, పోలీసు అధికారులకు పలుమార్లుఫిర్యాదు చేసినాస్పందించడం లేదని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా చెరువు కట్టపై వాహనాల అక్రమ పార్కింగ్‌ను నివారించేందుకు తగిన చర్యలు తీసుకోవాలనికోరుతున్నారు.

> **వాహనాల పార్కింగ్‌తో ఇబ్బందులు..**
>
> 
>
> చెరువు కట్టపై నుంచి సికింద్రాబాద్, తిరుమలగిరి నుంచి ఓల్డ్ బోయిన్‌పల్లి, సుచిత్ర, కానాజీగూడ ప్రాంతాలకు వందలాదివాహనాలు వెళ్తాయి. ఈ అక్రమ పార్కింగ్‌తో రోడ్డుచిన్నగైపోవడం ఒకటైతే మూల మలుపు వద్ద అక్రమ పార్కింగ్ ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. ఈ విషయంపైసంబంధిత అధికారులు కఠిన చర్యలు తీసుకోని అక్రమ పార్కింగ్‌ను అడ్డుకట్టవేయాలి. కొన్ని వాహనాలు నెలల తరబడి పార్కింగ్‌లోనే ఉంటున్నాయి. అవి దొంగలించి ఇక్కడ పార్కింగ్ చేసి వెళ్లిపోతున్నారా? అనే ప్రశ్న తలెత్తుతోంది.
>
> – మక్కాల సత్యనారాయణ, అంజయ్యనగర్

ఎమ్మెల్యే గాంధీకి 'సమస్యలు కనపడవు'



వెంకటపాపయ్యనగర్‌లో సమస్యలు తెలుసుకుంటున్న శేరిలింగంపల్లి బీజేపీ నాయకులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ బస్‌స్టాప్‌లో బీజేపీ జెండాను శేరిలింగంపల్లి నియోజకవర్గ బీజేపీ నాయకుడు గజ్జల యోగానంద్ బుధవారం నాయకులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం సమస్యలను తెలుసుకునేందుకు వెంకటపాపయ్యనగర్ వరకు పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఎటు చూసినా సరైన రోడ్లు లేవని... సరైన సమయంలో తాగునీరు సరఫరా కావటం లేదన్నారు. తక్కువ సమయం నీటి సరఫరా చేయడంతో ఇబ్బందులకు గురవుతున్నామని తెలిపారు. అదేవిధంగా సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో చిన్నపాటి వర్షానికి డ్రైనేజీలు పొంగుతున్నాయని పేర్కొన్నారు. దోమల బెడదతో మలేరియా, డెంగీ బారిన పడుతున్నారని చెప్పారు.

◆ సమస్యలను ఎమ్మెల్యే, కార్పొరేటర్ల దృష్టికి తీసుకెళ్లినా స్పందించకపోవడంతో సొంద ఖర్చుతో డ్రైనేజీ వ్యవస్థను బాగు చేసుకుంటున్నామని తెలిపారు. చీకటి పడిందంటే రోడ్లపై నడవలేని పరిస్థితి నెలకొంటోందన్నారు. అనంతరం యోగానంద్ మాట్లాడుతూ... ఎమ్మెల్యే గాంధీకి ప్రజా సమస్యలు కనపడవు, వినపడవు అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను పరిష్కరించడానికి బీజేపీ తలపెట్టిన ''మీ సమస్య.. మా పోరాటం''ద్వారా ఈ సమస్యలపై పోరాడి త్వరలోనే వీటి నుంచి ప్రజలకు విముక్తి కల్పిస్తామని స్థానికులకు హామీ ఇచ్చారు.

భీమునికుంట చెరువు పరిశీలన



భీమునికుంటలో సీవరేజ్ నీరు కలుస్తున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని భీముని కుంట చెరువులోకి సీవరేజ్ నీరు కలుస్తోందని తెలుసుకున్న కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు ఇరిగేషన్, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... డ్రైనేజీ సమస్య పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నామని అన్నారు. కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు మొదటి ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. అభివృద్ధి పనుల నాణ్యతలో రాజీ పడకుండా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ విశ్వం , జీహెచ్ఎంసీ ఏఈ రాజీవ్, వర్కు ఇన్‌స్పెక్టర్ మహదేవ్, నాయకులు పోతుల రాజేందర్, కుమారస్వామి, రాజుసాగర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో పేదలను ఆదుకుంటున్నాం

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



ఎల్‌ఓసీ పత్రాలను లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గంలో అభివృద్ధి పనులను పూర్తి చేయటంతో పాటు సంక్షేమ పథకాలు ద్వారా పేదలను ఆదుకుంటున్నామని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బుధవారం నియోజకవర్గానికి చెందిన మహమ్మద్ జంషీద్‌కు రూ.2.50లక్షలు, కె.రాఘవేణికి రూ.94వేల ముఖ్యమంత్రి సహాయ నిధి ఎల్ఓసీ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకుని బిల్లులు కట్టలేని నిరుపేదలకు ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరుతుందన్నారు. ఇది నిరంతరం కొనసాగుతుందని ఎవరైనా నిజమైన లబ్ధిదారులు ఉంటే దరఖాస్తు చేసుకొని లబ్ధి పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హరేరామ హరేకృష్ణ మంత్ర జపపూజ

కుత్బుల్లాపూర్: సుభాష్‌నగర్ డివిజన్ పరిధిలోని ఫాక్స్ సాగర్ వద్ద ఛట్ పూజా సేవా సమితి ఆధ్వర్యంలో 24 గంటల పాటు హరే రామ.. హరే కృష్ణ మంత్ర జప పూజ ను చేపట్టారు. గత 31న ఉదయం 10.30 గంటలకు ప్రారంభమైన ఈ జపపూజ బుధవారం ఉదయం 10.30 గంటల వరకు కొనసాగింది. ఈ సందర్భంగా యువనేస్తం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కేపీ విశాల్‌గౌడ్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఛట్ పూజా సేవా సమితి అధ్యక్షుడు సంతోష్ ఠాకూర్, ప్రసన్న మిశ్రా, ముకుల్ సింహ, కిరణ్‌రెడ్డి, చందన్ సారమ్‌సింగ్, సునీల్‌కుమార్, రూపేష్, వినయ్‌సింగ్, సునీల్, దినేష్, ముఖేష్, సంతోష్ ఠాకూర్, ప్రమోద్ ఠాకూర్, గిరి దాదా, వికాస్, దిలీప్ అనిల్ తివారి, శ్రీనివాస్, షిండే పాల్గొన్నారు.

కాసాని జ్ఞానేశ్వర్‌కు ఈటల పరామర్శ

నిజాంపేట్: తెలంగాణ టీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ మాతృమూర్తి కాసాని కౌసల్య అంత్యక్రియలు బుధవారం బాచుపల్లిలో ముగిశాయి. కాసాని జ్ఞానేశ్వర్ కుటుంబసభ్యులను బీజేపీ రాష్ట్ర నాయకుడు, ఎమ్మెల్యే ఈటల రాజేందర్, టీడీపీ నాయకురాలు సుహాసిని, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



సుభాష్‌నగర్: ప్రభుత్వ స్థలాలు చేపట్టే నిర్మాణాలను అమాయకులు కొనుగోలు చేసి మోసపోవద్దని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. గాజులరామారంలోని ప్రభుత్వ స్థలంలో వెలిసిన పలు నిర్మాణాలను బుధవారం నేలమట్టం చేశారు. దేవేందర్‌నగర్ సర్వే నం .329/1 లో నాలుగు గదులు, 10 బేస్‌మెంట్లు, 342 మంజూర్‌నగర్‌లో 8 బేస్‌మెంట్లు, మెట్‌కానిగూడలో ఒక గదిని కూల్చి వేశారు.

నిర్మాణ పనులను నాణ్యతతో పూర్తి చేయాలి



రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రోజాదేవి

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని వడ్డేపల్లి ఎన్‌క్లేవ్ ముందు మాధవరం కాలనీ రోడ్డు కలుపుతూ వెళ్లే ప్రధాన రహదారిలో నాలాపై నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను బుధవారం కార్పొరేటర్ మాధవరం రోజాదేవి పరిశీలించారు. అనంతరం దీనబంధుకాలనీ నుంచి జగద్గిరిగుట్ట చౌరస్తా వరకు ఉన్న ప్రధాన రహదారిపై నిర్మిస్తున్న రోడ్డు పనులను పరిశీలించారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, డివిజన్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, ఏఈ ఆశ, వర్కు ఇన్‌స్పెక్టర్ గురువారెడ్డి, ఏఈ శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నిజాంపేట్ కార్పొరేషన్ అవినీతిపై చర్చకు సిద్ధమా?

బీజేపీ నాయకుడు ఆకుల సతీష్



ప్రగతినగర్ మూడు కోతల బొమ్మ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో నిధుల కేటాయింపు, మౌలిక వసతుల కల్పన, అవినీతిపై ఎమ్మెల్యే చర్చకు సిద్ధమా అని నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ నాయకుడు ఆకుల సతీష్ సవాల్ విసిరారు. బుధవారం ప్రగతినగర్‌లోని మూడు కోతుల బొమ్మ చౌరస్తా వద్ద బీజేపీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. రెండేళ్లుగా నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వానికి రూ.350 కోట్ల రెవెన్యూ వస్తే స్థానికంగా అభివృద్ధికి కేవలం రూ.50 కోట్ల నిధులను ఇవ్వడం దారుణమన్నారు. రాష్ట్రంలో వసూలవుతున్న ట్యాక్స్‌లను కేంద్ర ప్రభుత్వం వాడుకుంటోందని గగ్గోలు పెడుతున్న పురపాలక మంత్రి కేటీఆర్ నిజాంపేట్ కార్పొరేషన్‌లో వసూలవుతున్న టాక్స్‌లను ఇక్కడ ఎందుకు ఖర్చు చేయడం లేదని ప్రశ్నించారు.

◆ మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు చేసినా ప్రత్యేక గ్రాంట్ కింద రూ.10 కోట్లు ఇవ్వలేదన్నారు. ఇప్పటి వరకు డివిజన్‌కు రూ.2 కోట్లు కేటాయిస్తే ఎక్కడ అభివృద్ధి జరుగుతుందన్నారు. కార్పొరేషన్ పరిధిలో తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యారని, వందలాది ప్రభుత్వ భూమి ఉన్నా మినీ స్టేడియాన్ని, మోడల్ మార్కెట్‌ను నిర్మించలేదన్నారు.

◆ ఈ నిరసన కార్యక్రమంలో పార్లమెంట్ కోకన్వీనర్ డాక్టర్ రాజు, ఎస్సీ మోర్చా రాష్ట్ర జాయింట్ కన్వీనర్ దాసి నాగరాజు, ప్రధాన కార్యదర్శి భిక్షపతియాదవ్, సెక్రటరీ సత్యనారాయణ, ఎస్టీ మోర్చా అధ్యక్షుడు అశోక్‌నాయక్, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు రాము, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు మదన్‌గౌడ్, బీజేవైఎం ఉపాధ్యక్షుడు నరసింహారెడ్డి, కిసాన్ మోర్చా అధ్యక్షుడు ప్రసాద్ రాజు, 14వ డివిజన్ శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ శేషారావు, సీనియర్ నాయకులు వీరెల్లి లక్ష్మయ్య, పురుషోత్తం, సాయి, పురుషోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బావను చంపిన బావమరిది

- అప్పు చెల్లించకపోవడంతోనే హత్య చేసినట్లు భావిస్తున్న పోలీసులు
- మృతుడి సోదరుడి ఫిర్యాదుతో కేసు నమోదు

కేపీహెచ్‌బీకాలనీ: మద్యం మత్తులో సొంతబావను తలపై బీరు బాటిల్, బండరాయితో కొట్టి దారుణంగా హత్య చేసిన సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. అప్పుగా తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వలేదనే కారణంతోనే అంతమొందించినట్లు భావిస్తున్నారు.

◆ కేపీహెచ్‌బీ ఇన్‌స్పెక్టర్ కిషన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా కొహిర్‌మండలం మన్యర్‌వాడికి చెందిన అబ్దుల్ అన్వర్ (27)కు 2019లో నగరంలోని మియాపూర్, హఫీజ్‌పేట్‌కి చెందిన ఫరీన్ బేగంతో వివాహం జరిగింది. ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. అబ్దుల్ అన్వర్ బావమరిది సయ్యద్ అహ్మద్ స్నేహితుడైన మహమ్మద్ అఖీల్ వద్ద ఆటో అద్దెకు తీసుకొని నడుపుతున్నాడు. కొద్ది రోజుల తరువాత ఆటో అద్దెకు తీసుకున్న వ్యక్తి నుంచి కొంత డబ్బు అప్పుగా తీసుకున్నాడు.

◆ ఆటో అద్దె, అప్పుగా తీసుకున్న డబ్బు మొత్తం వడ్డీతో కలిపి 1 లక్ష 45 వేల రూపాయలు అయ్యింది. డబ్బులు తిరిగి చెల్లించాలంటూ అన్వర్‌ను తరచూ అఖీల్ అడుగుతున్నా చెల్లించడం లేదు. దాంతో అఖీల్ అన్వర్ బావమరిదిపై ఒత్తిడి తెచ్చాడు. గత నెల 30న అన్వర్ బావమరిది సయ్యద్ అహ్మద్ హైదరాబాద్ నుంచి కొహిర్‌కు వెళ్లి ఒక రోజు అక్కడే ఉండి 31న అన్వర్‌ను తీసుకొని హైదరాబాద్ వచ్చాడు. అదే రోజు రాత్రి 8 గంటల నుంచి మద్యం సేవిస్తున్న వీరు డబ్బు విషయంలో గొడవపడి హైటెక్ సిటీ రైల్వేస్టేషన్ సమీపంలో ముళ్లకత్వ చెరువు గట్టుపై అన్వర్‌ను అంతమొందించారు.

◆ బుధవారం మృతుడి సోదరుడు అబ్దుల్ సమద్‌కి అన్వర్ స్నేహితుడు ఫోన్‌చేసి అన్వర్‌ను బావమరిది సయ్యద్ అహ్మద్ అతని స్నేహితులు తీసుకెళ్లి ముళ్లకత్వ చెరువు వద్ద హత్య చేశారని తెలిపాడు. కేపీహెచ్‌బీ కాలనీ 4వ ఫేజు ముళ్లకత్వ చెరువు వద్ద గుర్తు తెలియని వ్యక్తి రక్తపు మడుగులో పడి ఉన్నాడని సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు.

◆ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతుడి సోదరుడు సమద్ తన సోదరుడిని అతని అత్త, బావమరిది, అతని స్నేహితులు హత్య చేశారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వేడుకగా దేవాలయాల వార్షికోత్సవాలు



పాపిరెడ్డినగర్‌లోని శ్రీవీరాంజనేయ శివాలయ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ



హోమ పూజలో పాల్గొన్న భక్తులు

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి డివిజన్ పాపిరెడ్డినగర్‌లోని శ్రీవీరాంజనేయ శివాలయం 16వ వార్షికోత్సవాలు బుధవారం ఆలయ కమిటీ ఘనంగా నిర్వహించింది. ఆలయ అర్చకులు పరంకుశం వెంకటాచారి, గంగాధర్ ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం స్వామివార్ల ఊరేగింపు మేళ తాళాలు, భజన కీర్తనల మధ్య కొనసాగింది. ఈ వేడుకల్లో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, జగద్గిరిగుట్ట ఇన్‌స్పెక్టర్ సైదులు పాల్గొని స్వామివారి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గడ్డం రాజేశ్వర్‌రెడ్డి, అధ్యక్షుడు ధర్మారావు, ప్రధాన కార్యదర్శి దొడ్ల రాంరెడ్డి, కోశాధికారి కిరణ్, బస్తీ అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి పాల్గొన్నారు.

శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో..

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్ కాలనీలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం 18వ వార్షికోత్సవంలో బుధవారం బీజేపీ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనను ఆశీర్వదించి స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. ఆలయ అభివృద్ధికి సహకరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రామారావు, కాలనీ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, సెక్రటరీ జైహింద్, గోవింద్, రామయ్య, రఘునందర్, శేషయ్య, రవికుమార్, సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

మోతీనగర్: పాండురంగనగర్‌లోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవాలయం ఆవరణలోని సాయిబాబా ఆలయ వార్షికోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కాగడా హారతి, శ్రీ సాయినాథుడికి ప్రత్యేక అలంకరణ, అర్చన, సామూహికదత్త మూలమంత్ర ఆహ్వానం , మధ్యాహ్నం హారతి, సంధ్యాహారతి, విష్ణు సహస్రనామ పారాయణం, పంచామృతంతో సాయినాధునికి అభిషేకం, నూతన వస్త్ర అలంకరణతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదే విధంగా గురువారం సంధ్యాహారతితో వేడుకలు ముగుస్తాయని ఆలయ కార్యనిర్వాహణ అధికారి జీఏకే కృష్ణ తెలిపారు.



బాబా మెడలో కరెన్సీ నోట్లతో చేసిన హారం

వైభవంగా సమ్మక్క, సారలమ్మ జాతర

కూకట్‌పల్లి: ఆస్‌బెస్టాస్ కాలనీలో శ్రీ సమ్మక్క సారలమ్మ జాతరకు సైతం వడ్డేపల్లి రాజేశ్వరరావు వెళ్లి సమ్మక్క, సారలమ్మను దర్శించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ భూపాల్‌రెడ్డి ఆయనను శాలువాతో సన్మానించారు. సమక్క, సారలమ్మ జాతర ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులను అభినందించారు. ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయాలని తన వంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహేష్‌గౌడ్, రామ్‌మోహన్‌రావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పాపిరెడ్డినగర్‌లో సమక్క, సారక్కకు పూజలు..

కూకట్‌పల్లి పాపిరెడ్డినగర్‌లో జరుగుతున్న సమ్మక్క, సారక్క జాతరలో బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అర్శనపల్లి సూర్యరావు పాల్గొన్నారు. గద్దెల మీద ఏర్పాటు చేసిన సమ్మక్క, సారలమ్మ వనదేవతలను దర్శించుకున్నారు. అమ్మవార్లకు ఇష్టమైన బంగారం ప్రసాదంగా సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనను సన్మానించారు. ఆలయ నిర్మాణానికి సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపారు.



శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న వడ్డేపల్లి రాజేశ్వరరావు



వనదేవతలను దర్శించుకుంటున్న అర్శనపల్లి సూర్యారావు